# కారుణ్యమూర్తి

శివరామయ్యగారు తండ్రి అస్తికల్ని పవిత్రమైన త్రివేణీ సంగమంలో కలిపి అప్పుడే సపరివారంగా యింటికి తిరిగొచ్చారన్న వార్త, ఊళ్లో నలుమూలలకీ ప్రాకిపోయింది.

గ్రామంలోని ముఖ్యులంతా ఆ వార్త వినగానే ఎవరి మట్టుకు వారు వచ్చి తమకు తోచిన విధంగా శివరామయ్యగార్ని పరామర్శించి పోతున్నారు. శివరామయ్యగారి కుటుంబం తాలూకు బంధువులూ, అయినవాళ్ళూ, స్నేహితులూ అంతా అప్పటికప్పుడే వచ్చి ఇంట్లో మకాం వేసేశారు.

భారతదేశంలో వున్న పవిత్ర నదీనదాల్లో శివరామయ్యగారు తండ్రిగారి చితాభస్మాన్ని కలపాలన్న చిరకాలవాంఛనీ, మహత్తరమైన సంకల్పాన్నీ, నిర్విఘ్నంగా పూర్తిచేసుకొని వచ్చి వెచ్చటి నిట్టూర్పు వొకటి విడిచారు. శివరామయ్యగారే కాదు, వూరువూరూ ఒక వేడి నిట్టూర్పు విడిచిందంటే అతిశయోక్తి లేదు.

ఎవరో ఎల్లయ్యగారి తండ్రి చనిపోతే వూరు వూరూ నిట్టూర్చి బాధపడాల్సిన అవసర మేమొచ్చిందని శివరామయ్యగారి కుటుంబం సంగతీ, గతించిన పరంధామయ్యగారి ప్రఖ్యాతి గురించీ తెలియనివాళ్లు అనుకుంటే అనుకోవచ్చు.

ఏ వూరుకూ పట్టని వులిపికట్టె, లోకానికి బరువైన ఏ లూకాయో చనిపోతే వూళ్లోవాళ్ళ కేమీ పట్టని మాట వాస్తవమే కావొచ్చు గాని, శిబిచక్రవర్తిలాంటి పరంధామయ్యగారు కళ్ళు మూశారనగానే వూళ్లో ఆబాలగోపాలం కళ్ళూ చెమ్మగిల్లాయంటే సత్యదూరం కాదు.

పరంధామయ్యగారు పోవడం అంటే ఊరికి నడిబొడ్డే వూడిందన్నమాట. శివరామయ్యగారి కుటుంబం వూరికి పెట్టని కోట. తండ్రికొడుకులూ వూళ్ళోవున్న పాటకజనానికీ, బీదా బిక్కీకి ఓ అండ అనేకంటే, కల్పతరువు అన్నా వాస్తవ స్థితిని కొంత తగ్గించి చెప్పటమే నన్నమాట.

పండువృద్ధయి పరంధామయ్యగారు రాలిపోయినా, ఆయనగారి పేరు ఆచంద్రతారార్కంగా ప్రజల హృదయాల్లో పాదుకొనిపోయే ఏర్పాట్లన్నీ; తండ్రిగారు కోరినప్రకారం చేయడానికి శివరామయ్యగారు సంసిద్ధులయారు. తండ్రిగారి చితాభస్మాన్ని కర్మభూమిలో వున్న పుణ్య నదీనదాల్లో కలిపి రావడంతో శివరామయ్యగారి భగీరథ ప్రయత్నంలో తొలి ఘట్టం పరిసమాప్త మయింది. శివరామయ్య తండ్రికి మించిన కొడుకు. ఆయన వంశపుకీర్తి కస్తూరి వాసనలా ఆ చుట్టు పక్కల పాకిపోయింది. ఆ వంశంలో పిచ్చిమొక్క పుట్ట లేదు. పుట్టిన ఏ మొక్కకూ కుక్కమూతి పిందె కాయనూ లేదు. ఆ కుటుంబంలో పుట్టినవాళ్ళంతా కుటుంబ గౌరవం కోసం అంతో యింతో పిత్రార్జితమైన ఆస్తి తగలేసుకొన్న వాళ్లే. దయాదాక్షిణ్యాలు వాళ్ళ సొత్తు. గడపతొక్కి దేహీ అన్నవాళ్లు వట్టిచేతుల్తో తిరిగిపోలేదు. వాళ్ళున్నచోట పాములు కూడా నిర్భయంతో తిరిగేవన్నా ఆశ్చర్యం లేదు.

కాని అలాంటి వంశం శివరామయ్యగారితో అఖరవబోతూందన్న విచారం శివరామయ్యగారికంటే లోకానికే ఎక్కువగా పట్టిందనుకోవచ్చు.

ఏభైయ్యో పడిలో ప్రవేశించిన శివరామయ్యగారికి సంతానం కలుగుతుందన్న ఆశలు అడుగంటాయి. పరంధామయ్యగారి పరలోక యాత్రతో ఆ వంశం తాలూకు కీర్తి ప్రతిష్ఠలూ, డెభ్భై ఎనభై యకరాల మాగాణీ, పదెకరాల మామిడితోటతో సహా శివరామయ్య మిగిలిపోయాడు. సంతానం కలుగుతుందన్న ఆశలు నశించడంతో, శివరామయ్యగారు తెగబడి ధర్మకార్యాలకు పూనుకున్నారు. వంశపారంపర్యంగా ఆ వంశీకుల రక్తంలో ప్రవహించిన ధర్మదీక్ష, త్యాగనిరతికీ చెలియలికట్టలు తెగినై! తండ్రిగారు తనువు చాలించడంతో శివరామయ్య ధర్మకార్యాచరణకు పూనుకొన్నాడు. తండ్రిగారి కర్మకాండను బ్రహ్మాండంగా జరిపి ఆయన పేరుతో ఒక అనాధశరణాలయాన్ని స్థాపించడం శివరామయ్యగారి మహత్తర సంకల్పములో ప్రధానమైంది. శివరామయ్యగారు హితులూ, ఆప్తులూ, పెద్దలతో సంప్రదించిన మీదట తండ్రిగారి జ్ఞాపకార్థం మామిడితోటలో ఓ విశాల భవనాన్ని నిర్మించి, అందులో పరంధామయ్యగారి సమాధిని ఏర్పరచాలన్న నిర్ణయానిక వచ్చారు. భవన నిర్మాణం పూర్తి అవుతూండగానే శివరామయ్యగారు పుణ్యనదీనదాలను, పుణ్యక్షేత్రాలను దర్శించి రావడానికి వెళ్ళారు.

తండ్రిగారి చితాభస్మాన్ని త్రివేణీ సంగమంలో కలిపి తిరిగి రాగానే, తన్ను పరామర్శించటానికి వచ్చిన మనుష్య

లకు శివరామయ్య తండ్రి కడసారిగా కోరిన కోరికను తెలియ జేశాడు.

తండ్రి పరంధామయ్యకు ఏభయ్యో సంవత్సరం తిరక్కముందే పళ్ళన్నీ వూడిపోయినా, కింది వరుసలో ఒక దంతం మాత్రం చనిపోయేముందుదాకా వుంది. అన్ని పళ్ళూ అకాలంగా వూడిపోయి, ఆ ఒక్కటి చిరకాలంగా వుండేమో. పరంధామయ్యగారికి ఆ దంతం అంటే అమిత యిష్టం. దాన్ని ఎంతో ప్రేమగా చూసుకొనేవాడు. రోజుకు ఓ పదిసార్లయినా దాన్ని గురించి మాట్లాడకుండా వూరుకొనేవాడు కాడు. గట్టి పదార్థా లేవయినా తినేప్పుడు ఇహ సరేసరి! సుష్టుగా భోజనం చేయగానే ఒక్క పలుకు ఆ పంటిమీదకు నెట్టుకొని పై చిగురుతో వత్తుకుంటూ ఎంత ఆనందాన్ని పొందేవాడో ఎంత తృప్తిరసంతో ఆ ఒక్క పలుకును ముంచేవాడో సరిగా చెప్పటానికి గతించిన ఆ పరంధామయ్యే తిరిగి రావాలి! ఆయ నకు ఆత్మీయమైనవాటిల్లో ఆ దంతం ఒకటి. కొడుకు శివరా మయ్యా, తరగని ఆస్తి, ఆ పన్నూ, మూడూ మూడెత్తులుగా చూచుకొనేవాడు.

ఆ దంతం కదులుతూనే ఆరునెల్లు ఆయనగారి నోట్లో వుండిపోయింది. అది వూడిపోయిన రోజున ఆయనగా రెంత బాధపడ్డాడో చెప్పటానికి వీల్లేదు. పూర్తిగా పట్టుతప్పి వూడి పోయిన తర్వాత రెండు రోజులవరకూ ఆ దంతాన్ని నోట్లోనే వుంచుకొన్నాడు. అంతకాలంగా ఆ బోసినోటికి అంటిపెట్టు కొని వున్న పన్ను వూడిపోయిందంటే ఒక్కసారిగా నమ్మ టానికి వృద్ధాప్యంలో వున్న ఆయన మనసుకు చాలా కష్టమయి పోయింది. వూడిపోయిన దంతాన్ని ఇనప పెట్టెలో పెట్టుకొని

భద్రంగా దాచుకొన్నాడు. రోజుకు నాలుగుసార్లయినా దాన్ని బయటికి తీసి చూసుకొని సంతృప్తిపడిపోయేవాడు. ఊడిపోయిన పంటిపై తండ్రి చూపిస్తోన్న పిచ్చి ప్రేమకు శివరామయ్య తనలో తనే చిరునవ్వు నవ్వుకొనేవాడు.

ముసలితనంలో మనుషుల మమకారాలు ఎలా పరిణమించుతాయో శివరామయ్యకు అర్థం కాకపోలేదు. అణచబడ్డ మమకారాలు వృద్ధాప్యంలో వికృతరూపంతో బయటపడతాయి. మానవుని మనస్తత్వంలో జీర్ణించుకుపోయిన "తన వస్తువు", "తనవాళ్ళు", "తన తనం" వార్ధక్యంలో పిచ్చికుక్కలా బయటికి గెంతుతుంది. తను వాడుకొనే చెంబు దగ్గర్నుంచి మంచందాకా వాళ్ళ ప్రాణంతో ముడివేసుకొని వుంటారన్న సంగతి పెద్ద చదువులు చదువుకొన్న శివరామయ్యగారికి తెలియని విషయం కాదు.

పరంధామయ్య చనిపోతూ కొడుకుని పిలిచి ఆ దంతాన్ని కొడుకు రెండు చేతుల్లో పెట్టి తన ఆఖరి కోర్కెగా చెప్పాడు బంగారంతో చేసిన పెట్టెలో ఆ పంటిని పెట్టి, తన సమాధిలో స్థాపితం చేయాలని కోరాడు. కొడుకుచేత చేతిలో చెయ్యి వేయించుకొని మరీ కళ్ళుమూశాడు పరంధామయ్య.

తండ్రి బ్రతికుండగా ఆ కోర్కెను తేలిగ్గా తీసుకొన్న శివరామయ్యకు తండ్రి చనిపోగానే తండ్రిగారి కడసారి కోర్కెను నెరవేర్చాలన్న పట్టుదల కలిగింది. తండ్రియంకు కొడుకుకి వున్న ప్రేమా, గౌరవం—పెద్దమాటల్లో చెప్పాలంటే "పితృభక్తి", "పితృవాక్య పరిపాలనా"లాంటి వంశ పారంపర్య గుణాలు శివరామయ్య రక్తంలో ప్రవహించి కార్యదీక్షకు పురిగొల్పినై.

అయినా శివరామయ్యకుమాత్రం ఎవరు వున్నారు? చనిపోయిన తండ్రి తాలూకు త్రివేణీసంగమంలో కలవగా మిగిలిన అస్థికలూ ఆ పన్నూ, ఇంకా మిగిలిన ఆస్తీతప్ప!

పుణ్యక్షేత్రాలన్నీ సందర్శించి తిరిగొచ్చిన శివరామయ్య గారిని పరామర్శించటానికొచ్చిన పెద్దలు పరంధామయ్యగారి కడసారికోర్కె విని వూరికే వుండలేకపోయారు. ఎవరికి తోచినవిధంగా వారు సలహాలిచ్చారు. తండ్రిగారి కడసారి కోర్కెను ఏ విధంగానూ అశ్రద్ధచేయటానికి వీల్లేదని హెచ్చ రించారు. ఆ పన్ను వుంచాల్సిన పెట్టెను కనీసం ఇరవై తులాల మేలిమి బంగారంతోనైనా చేయించకపోతే బాగుండ దనే నిర్ణయానికొచ్చారు. చేయవలసిన ఏర్పాట్లనుగురించి కొంత చర్చ జరిగాక వుద్రేకపూరితుడై శివరామయ్యే ముందు కొచ్చి, మేలిమిబంగారం పెట్టెలో నవరత్నాలు పొదివిన పీఠి కపై నాన్నగారి దంతాన్ని అమర్చి బ్రహ్మాండమైన వుత్సవం జరిపి సమాధి చేయించాలన్న నిర్ణయానికొచ్చాడు.

.... .... .... ....

అనుకున్న ప్రకారం అన్ని ఏర్పాట్లూ అనతి కాలంలోనే పూర్తి అయినై. మామిడితోటలో విశాలమైన భవన నిర్మా ణమూ, అనాధ శరణాలయం స్థాపనకు ఏర్పాట్లు పూర్తి అయినై. పట్టణంనుంచి పిలిపించిన శిల్పి బంగారపు పెట్టెను తయారుచేసి సమయానికి తెచ్చాడు. సువర్ణ పేటికను తెచ్చా డన్న వార్తను వినగానే ముఖ్యులంతా అది చూడటానికి శివ రామయ్యగారింటికి ఒచ్చారు. ఊళ్లో పెద్ద తలకాయలన్నీ ఒకరినిమించి ఒకరు శివరామయ్య నెత్తిన వేసుకొన్న కార్య

భారాన్ని తమ సొంత పనిగా చూసుకొంటున్నారు. అంతమంది సహాయ సహకారాలు లభించటంబట్టే శివరామయ్య పనులన్నీ యింతవరకూ నిరాటంకంగా కొనసాగించుకు రాగలిగాడు. దానికంతా కారణం శివరామయ్య మంచితనం; ధర్మకార్యాచరణే అనుకోండి.

సువర్ణపేటిక చూడటానికొచ్చిన పెద్దల్నందరినీ సాదనంగా ఆహ్వానించాడు శివరామయ్య. వెంకన్నను పిలిచి అరుగులమీద చాపలు పరిచాక, కాఫీ ఏర్పాట్లు చూడమని పురమాయించాడు. అతిథి మర్యాదల్ను గురించి నలభై సంవత్సరాల పైగా శివరామయ్యగారిట్లో పనిచేస్తూన్న వెంకన్నకు ఒకరు చెప్పాల్సిన పనిలేదు.

వెంకన్న జీవితం శివరామయ్యగారింట్లోనే ప్రారంభమైంది. వెంకన్నంటే ఆ యింట్లో ఒక సేవకుడు మాత్రమే కాదు, ఆ కుటుంబంలో ఓ భాగం. వెంకన్న భుజాలపైనే పెరిగాడు శివరామయ్య. ఇప్పుడు వంగిపోయి గూని తేలిన వెంకన్న మూపుపైనే శివరామయ్య బాల్యదశను గడుపుకొన్నాడు. తెల్లబడిపోయి కింద పెదిమలపై వాలిపోయిన వెంకన్న మీసాలతోనే శివరామయ్య తన చిన్నతనంలో ఆడుకొన్నాడు. ఈనాడు వెంకన్న మెడపై జారుకారుడుతూన్న జుట్టుముడికంటే శివరామయ్యకు శైశవదశలో యిష్టమైన ఆటవస్తువు మరొకటి వుండేదికాదు. శివరామయ్య, వెంకన్న సంబంధం యజమాని సేవకుడుమాత్రమే కాదు. వస్తువూ, నీడలాంటిది. శివరామయ్యకు కనుపాప వెంకన్న.

వెంకన్న హృదయంలో పరంధామయ్యగారి కుటుంబం —వెంకన్న కంటిపాపల్లో శివరామయ్య — అదే వెంకన్నకు శివరామయ్యగారి కుటుంబానికివున్న సంబంధం.

పంచ అరుగులమీద కూర్చొన్న పెద్దలందరికీ కాఫీ దగ్గర్నుంచి లంక పొగాకుదాకా ఎవరిక్కావల్సినవి వాళ్ళకు అందించి, వెంకన్న స్తంభానికి ఆనుకొని యజమానివైపు చూస్తూ నుంచొన్నాడు.

శిల్పి తెచ్చిన పెట్టెను శివరామయ్య సదస్యులకు చూపించాడు. వజ్రాలతో పొదిగిన ఆ పెట్టెనుచూసి పెద్దలంతా ముగ్ధులైపోయారు. పెట్టె లోపలిభాగంలో రెండు అంగుళాల చదరం మేరలో ముత్యాలతో అంచులుకట్టి పన్ను వుంచటానికి ఏర్పాటు చేయబడివుంది. శిల్పి నైపుణ్యాన్ని అందరూ మెచ్చుకొన్నారు.

శివరామయ్య సగర్వంగా ఆ పెట్టెను రెండు చేతుల్లోకి తీసుకొని, అటూ యిటూ తిప్పుతూ గతించిన తండ్రి గుర్తురాగా చింతాక్రాంతు లయారు. అది గ్రహించిన పెద్దలు పరంధామయ్యగారి విశాలహృదయాన్ని, ఉదారత్వాన్ని కీర్తిస్తూ మాట్లాడుకోటం సాగించారు.

కొంతసేపు మౌనంగావుండి, తర్వాత శివరామయ్య వెంకన్నను పిలిచి చెప్పాడు.

"ఇదిగో వెంకన్నా ! నాన్నగారి దంతం టేబుల్ మీద వుంది. ఇలా తీసుకురా ?"

"ఎక్కడండీ వుందీ ?" అంటూ స్థంభానికి ఆనుకొని వున్న వెంకన్న ముందుకు వచ్చాడు.

"అక్కడేనోయ్! ఇనప్పెట్టె వున్న గదిలో. ఇందాక యినప్పెట్టె తీసినప్పుడు దంతాన్ని బయటికితీసి అక్కడే టేబిలు మీద పెట్టాను."

వెంకన్న వింటూనే లోపలికెళ్లాడు. అనాధ శరణాలయ ప్రారంభోత్సవానికీ, పరంధామయ్యగారి సమాధి నిర్మాణానికి, చేయాల్సిన ఏర్పాట్లనుగురించీ ముఖ్యులతో మాట్లాడటంలో మునిగిపోయిన శివరామయ్య లోపలికిపోయిన వెంకన్న యెంతసేపటికి రాకపోవడంచూసి పిలిచాడు.

"వెంకన్నా! ఎంతసేపు?"

"వస్తూన్నా! బాబు...అంటూ వెంకన్న తడబడుతూన్న అడుగులతో చెమటలు కారుకుంటూ వచ్చాడు. వణుకుతూన్న చేత్తో వెంకన్న దంతాన్ని యజమాని కిచ్చాడు. చెమ్మగావున్న కళ్ళను వొత్తుకుంటూ వోమూల నుంచొన్నాడు వెంకన్న.

వెంకన్న మనస్థితిని గమనించినట్టు జాలిగా చూశాడు శివరామయ్య.

"విశ్వాసమంటే అలా వుండాలి చూడండీ! వెంకన్నకు పెద్ద యజమాని తలుపుకొచ్చి ఎలా నిండార్లయిపోతున్నాడో!" అన్నాడు గ్రామ కరణం పక్కన కూర్చున్న మునసబుగారితో.

◆ ◆ ◆ ◆

ఒక శుభముహూర్తాన పరంధామయ్యగారి పంటిని సువర్ణపేటికలో వుంచి బ్యాండు సన్నాయి వాయిద్యాలతో వూరంతా వూరేగించి సమాధిలో పెట్టి స్థాపితం చేయించాడు కొడుకు శివరామయ్య. ఆనాడే తండ్రిగారి జ్ఞాపకార్థం నిర్మించబడ్డ అనాధ శరణాలయ ప్రారంభోత్సవము దేవాలయాల మంత్రిగారిచే బ్రహ్మాండంగా జరిగిపోయింది. భూదాన గోదా

నాలు; సువర్ణదానాలు శాస్త్రోక్తంగా చేశారు శివరామయ్య గారు. చుట్టుపక్కలనున్న పేదసాదలకు అన్నదానం, వస్త్ర దానం చేయబడింది. ఆరోజున చుట్టుప్రక్కల పదిమైళ్ళలోపున 'ఆకలి' అన్నవాడు లేడంటే అది ఎంత ఘనంగా చేయబడిందో తెలుస్తుంది. "ఆ తండ్రికొడుకు"ను తలవనివాడు ఆ రోజున ఆ ప్రాంతంలో నేలేడు. అలాంటి పుణ్యకార్యాలు చేయటానికైనా పూర్వజన్మ సుకృతం కావాలేమో? ఆ తండ్రికొడుకు లిద్దరూ "పెట్టిపుట్ట"డమే కాకుండా, "పుట్టీపెట్టారు" అని అనుకొంది లోకం అంతా.

కాని ఆసంబరం నాలుగు రోజులూ వెంకన్న గుబులు గుబులుగా వోమూల కూర్చున్నాడు. తిరిగిన కాసేపూ దిగులు దిగులుగానే తిరిగాడు. ఊరుజనం అంతా యింట్లోపడి యిష్టం వచ్చినట్టు తిన్నా, వెంకన్నకు మాత్రం అన్నం సహించలేదు. పాపం! ఆ నాలుగు రోజులూ పచ్చి మంచినీళ్లుకూడా ముట్ట లేదు. వెంకన్న వాలకం చూచాయగా గమనించినా మొల లోతున మునిగిపోయిన శివరామయ్యగారికి వెంకన్నను పిలిచి అడిగే సావకాశం చిక్కలేదు.

సువర్ణపేటికను సమాధిలో వుంచుతోన్నప్పుడు అక్కడ వెంకన్న లేకపోవడం శివరామయ్యకు కొంత వెలితి కలిగించక పోలేదు. వెంకన్నకు పరంధామయ్యగారి మీదున్న వెర్రి అభిమానమూ, విశ్వాసమూ, ప్రేమా, అతణ్ని అలా చేసి వుంటాయి అని అనుకొన్నాడు శివరామయ్య.

ఏమైనా, వెంకన్న అప్పట్నించీ అదోరకంగా మారి పోయాడు. అనంతమైనా బాధతో కుమిలిపోతూన్న వాడిలా అతనివాలకం మారిపోయింది. కళ్ళలో ఏదోతీరని వేదన!

నీడలావుండే వెంకన్న, యజమాని కనిపించినప్పుడల్లా మొహం తప్పిస్తూ తిరుగుతున్నాడు.

తన వాంఛితా లన్నిటినీ నెరవేర్చుకొని, సంతృప్తితో ఆనందంలో తేలిపోయాడు శివరామయ్య. తన జీవితానికి అంతకంటే యింకేంకావాలి? చేయగలిగిన సత్కార్యాలన్నీ చేశాడు. తండ్రిగారి పేరూ, కుటుంబ గౌరవమూ వంశకీర్తి శాశ్వితంగా లోకంలో వుండిపోగల ధర్మకార్యాలన్నీ చేశాడు. తనకా, యిహ వెనకా ముందూ లేదు. తన కోర్కెలన్నీ బతికుండగానే నెరవేర్చుకొన్నాడు. వృద్ధాప్యమా మీద పడింది. ఎప్పుడో ఆ మృత్యుదేవత చల్లగా వళ్ళోకి తీసుకోంటుంది! తండ్రిగారి సమాధిపక్కనే తన సమాధికి కావాల్సిన ఏర్పాట్లన్నీ ముందే చేసుకొన్నాడు. రాయీ, సున్నం అంతా తోలివుంది తండ్రిగారి సమాధివున్న మందిరం పక్కనే.

పదిహేను ఎకరాల పొలాన్ని, ఏటేటా వుత్సవానికీ, సమారాధన కర్చుల కిందా మందిరం పేరరాసి, ఐదుగురు ధర్మకర్తల సంఘాన్ని నియమిస్తూ వీలురాశాడు. వెంకన్న పేర వోపదెకరాలు వీలురాసి, బతికున్నంతకాలం మందిరంలో దీపారాధన చేసేట్టూ, తదనంతరం ఆ ఆస్తిమందిరానికి చెందేట్టూ సూచించాడు. మిగతా ఆస్తి అనాధ శరణాలయానికి చెందేట్టూ వీలురాసి రహస్యంగా రిజిష్టరు చేశాడు శివరామయ్య. ఇంక తనకావల్సిందేముంది? చేయాల్సిందిమాత్రం ఏముంది? శేషజీవితాన్ని ప్రశాంతంగా వెళ్ళబుచ్చడం, ఓ మంచి రోజున హంసను పరమాత్మలో ఐక్యం చేసుకోడం మినహా.

పగలు గీతాపారాయణం; రాత్రి పురాణశ్రవణం, మంగళవారం, శుక్రవారం హరికథా కాలక్షేపం, అవీ శివరామయ్యగారు పరమాత్మ సాన్నిధ్యంకోసం కాలాన్ని యీడుతూన్న తీరు. శివరామయ్యగారి మనసు యిప్పుడు ఐహిక వాంఛల కతీతం! అలా అని ఆముష్మికానికని ఆరాటమూ లేదు. శాంతీ! ప్రశాంతీ ఆత్మశాంతీ; ఆయనక్కావాల్సింది. శివరామయ్యగారు జీవితమనే సముద్రంలో తనువు అనే పడవకు శాంతి తెరచాప వేసుకొని కాలం గాలిలో నిర్లిప్తంగా ప్రయాణం చేస్తున్నారు. మానవత్వానికి సంపూర్ణత్వం సిద్ధించటానికి చేయాల్సిన మానవ ప్రయత్నంలో శివరామయ్యగారు ఏ లోపమూ చేయలేదనే చెప్పాలి!

కాని వెంకన్నలో వచ్చిన మార్పు ప్రశాంతంగా వున్న శివరామయ్యగారి హృదయంలో వోమూల కదులుతూనే వుంది. ఒకరోజున వెంకన్నను పిలిచి అడిగాడు. చిక్కి శల్యమై పోయిన వెంకన్న శరీరంలో వణుకూ, పాలిపోయిన ముఖంలో ఆవేదనా, లోతుకు పోయిన కళ్ళల్లో భయం, చంపలమీదా, గడ్డంకిందా జారిన మడతల్లో బాధా! అంతకన్నా వెంకన్నలో చూడగలిగిం దేమీ లేదు శివరామయ్య.

"వెంకన్నా! ఏమిటీ అట్లా అయిపోతున్నావు? సంగతేమిటో నాకు చెప్పరాదూ?"

తలగుడ్డ ముఖంపైకి లాక్కొని కుమిలి కుమిలి ఏడ్చాడు వెంకన్న.

"వెంకన్నా! ఏమిటిది వూరుకో! వంట్లో ఏమైనా సుస్తీగా వుంటూందా? డాక్టర్ను పిలిపించమంటావా? వెంకన్న ముఖంపైనుంచి గుడ్డను తీస్తూ అన్నాడు యజమాని.

"అదేం కాదు బాబూ! ఒంట్లో బాగానే వుందిలే బాబూ!"

"అయితే మరేమిటీ నీ బాధ?"

"అంతా కర్మబాబూ! కర్మ! పాపిష్టిజీవుడు బొందిని వదిలిపెట్టిపోలా!" రెండు చేతుల్తో తల బాదుకొంటూ గోలు గోలున ఏడుస్తూ పిచ్చివాడిలా వెళ్ళిపోయాడు వెంకన్న.

వెంకన్న బాధ చూచేసరికి నవనీతంలాంటి శివరామయ్యగారి మనస్సు అగ్నికి మైనపువత్తిలా కరిగిపోయింది! ఆయన గారి జాలిగుండె బరువెక్కింది. అయినా తనేం చేయగలడు? అసలు తన బాధేమిటో వెంకన్న చెప్పితేగదూ!

అయినా, శివరామయ్యగారు తన చివరిదశలో వెంకన్న కారణంగా ఆత్మశాంతికి అంతరాయాన్ని కలిగించుకో దల చుకో లేదు. తనకై తాను వచ్చి వెంకన్న బాధేదో చెప్పే దాకా తను చేయగలిగిందేమీ లేదనే నిర్ణయాని కొచ్చి తన మామూలు కార్యక్రమాన్ని మౌనంగా నిర్వర్తించుకుంటూ కాలాన్ని వెళ్ళబుచ్చుతున్నారు శివరామయ్యగారు.

ఆ తర్వాత, వారంరోజులు గడిచాక ఓనాటి అర్ధరాత్రి శివరామయ్యగారు గదిలో ఏదో అలికిడి విని మంచంమీద లేచి కూర్చొని దీపపు వత్తిని పైకెక్కించాడు. దీపం వెలుగులో గాబరాగా గదంతా కలయజూశాడు;

కాళ్ళ కట్టవైపు మంచంకోడుకు చుట్టుకొని వెంకన్న వొదిగిబడి వున్నాడు.

"నువ్వా! వెంకన్నా! ఏమిటిదీ? యింత అర్ధరాత్రి వేళ?" మంచంకోడుకు చుట్టుకొన్న వెంకన్నని లేవదీస్తూ ఆదుర్దాగా అన్నాడు.

మంచంకోడును వదలిన చేతుల్తో శివరామయ్యా రెండు కాళ్ళూ చుట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చాడు వెంకన్న.

"అబ్బబ్బ! ఏమిటీ పిచ్చి? వెంకన్నా లే!" చెప్పు అసలు సంగతేమిటో?''

"చెప్పుతా బాబూ! చెప్పుతా! నా కడుపులో రగులుకుపోతూన్న సిచ్చును యివాళ బయటపెడ్తా! గుండెల్లో భగభగమంటూన్న మంటను యివాళ బయటపెట్తా బాబూ! ఇకాపుకోలేను!"

"ఊఁ చెప్పుమరి!"

"రచ్చించాలి బాబూ! గోరమైన తప్పు జరిగిందిబాబూ! పెద్దదొరగారికే జరిగిందిబాబూ!"

"ముందు లేచి కూర్చొని సరిగా చెప్పు!"

వెంకన్న యజమాని కాళ్లు వొదిలి లేచి కూర్చొని నెమ్మదిగా, మధ్యమధ్య చీదివేస్తూ చెప్పాడు.

"తమరు ఆ రోజున పెద్దబాబుగోరి పన్ను బల్లమీద పెట్టింది తెలియక గది వూడ్చేటప్పుడు అదేదో పిల్లి తెచ్చి పడేసిన బొమికని, వూడ్చి పెంటపోగులో పారేశాను. మీరు ఆయాల మధ్యాహ్నం బాబుగారి పన్ను తీసుకురమ్మన్నప్పుడు పోయి పెంటపోగంతా వెతికాను. నేను పోగత్తి పోసినచోటే కుక్కపుర్రె వొకటి-పళ్ళన్నీ విడివిడిగా రాలిపోయి వుంది. అందులో పెద్దబాబుగారి పన్నేదో నాకు తెలియలేదు! మీరు తొందర పెట్తూంటే అందులో ఒకటి..."

అంతవరకూ విన్న శివరామయ్యా నిలువునా విరుచుకొని కిందపడ్డాడు. వెర్రిగా చూశాడు రెప్పవాల్చకుండా వెంకన్నను.

కొయ్యబారిపోయిన శివరామయ్యా కాళ్ళకు చుట్టుకొని వెంకన్న —

"నన్ను చంపేసేయండి బాబోయ్! యింత పాపం చేసి నోణ్ణి మీ చేతుల్తోనే గొంతు పిసికి చంపండి!" అంటూ పిచ్చిగా ఏడుస్తో అరిచాడు.

ఓ పది నిమిషాలకు శివరామయ్యాకు తెలివి వచ్చింది. తెల్లబడిపోయిన ముఖంలో రక్తపువర్ణం కదిలింది. నిలువుగుడ్లు పడిన కళ్ళల్లో ఎర్రజీరలు మెదిలాయి. వెంకన్న రెండు రెక్కలూ పట్టుకొని వాకిలిదాకా నెట్టుకొచ్చి అడిగాడు.

"ఈ సంగతి యింకెవరికైనా చెప్పేవా?"

"నరమానవుడికి చెప్పలేదు దొరా!"

వెంకన్నను బయటికి నెట్టి తలుపు గడివేసుకొన్నాడు శివరామయ్యా.

ఆరాత్రి సరిగా నిద్రపోలేదేమో శివరామయ్యాగారు తెల్లవారి పదిగంటలదాకా తలుపు తీయలేదు. ఆరోజు బయట మొహం చూపలేదు; ఎవరితోనూ మాట్లాడలేదు. దినమూ జరుగుతూన్న పురాణకాలక్షేపానికి కూడా వెళ్ళలేదు.

ఏనాడూ భయమెరుగని ఆయనగారి కళ్ళల్లో ఏదో భయం మెరుస్తూ వుంది! మనసులో గుబులు గుబులు! అన్నం నీళ్ళూ సహించలేదు. ఆరోజునుంచీ ఏరాత్రీ సరిగా నిద్ర పోలేదు. ఏనుగంతటి శివరామయ్యా పీనుగలా తయారయాడు. తన నీడల్లోనే ఏదో భయం! వెన్నుకాచి ఏదో తరుముకొస్తూ న్నట్లు తొందర. గుండెల్లో పిరికితనం. ఆవేదన, తీరనిబాధ.

ఎంతమంది ఎన్ని అడిగినా ఏమీ చెప్పలేదు. కాని ఆయనగారి హృదయంలో అగ్నిపర్వతం కుములుతూంది. తుఫాను చెలరేగుతూంది.

తను యింత త్యాగం చేసి తన తండ్రికి చేసింది ఇదేనా? వెంకన్న యీ సంగతి యింకెవరికన్నా చెప్తే? అది నలుగురి నోటపడి పాకిపోతే ? తనవంశ గౌరవం; కీర్తి; ఏమైపోతుంది? ఆ కళంకం, ఆ అపకీర్తి, ఆ మాయని మచ్చ జన్మజన్మలకూ వుంటుంది! తరతరాలా చెప్పుకుంటారు.

అన్నీ పిచ్చిపిచ్చి ఆలోచనలు, వెర్రివ్యూహాలు, పీడకల లతో మథనపడి పోతున్నారు శివరామయ్యగారు. ఆరాటం; ఆవేదన. అశాంతి! ఏంచేయాలి ? ఏంచేయాలి !

తొమ్మిదోరోజు రాత్రి పీడకలలో తండ్రి పరంధామయ్య కన్పించాడు. తన తండ్రే ? శరీరం అంతా ఆయనే! ముఖం కుక్కముఖలాంవుంది! అంతా కుక్కముఖమే ! ఆమూతి ఆవళ్ళూను; కుక్కలాగా అరిచాడు ! ఏదో అడిగాడు; ఏడ్చాడు. కుక్కలా మొరిగాడు !

నిద్రలో శివరామయ్య గుండెలమీద బండలు పెట్టినట్టు దిగ్గునలేచి కూర్చొన్నాడు. వళ్ళంతా జలదరించింది ! వెంటనే నీరసం. ఆయాసం, దడ, భయం, వొణుకు!

గదంతా కుక్కలు మొరుగుతోన్నట్టువుంది ! మంచం కిందా, మంచంమీదా అదే మూలుగు !

లేచి వెళ్ళి తలుపు తీసుకొని వీధివాకిట్లోకి వెళ్ళాడు. గోడపక్కన రెండు నల్లకుక్కలు మోరలు పైకెత్తుకొని బిగ్గరగా ఏడుస్తున్నయ్ !

నరాల్లోకి సత్తువ తెచ్చుకొన్నాడు. సత్తువనిండా నీరసం! గుండెల్లోకి ధైర్యాన్ని కూడతీసుకొన్నాడు. దాన్నిండా పిరికి, భయం ! వణుకుతోన్న కాళ్లతో పెద్దపెద్ద అంగలువేసుకొంటూ

'యానాదీవాళ్ళ' గుడిసెలకేసి నడిచివెళ్ళాడు శివరామయ్య! తెల్లవారుజాము నాలుగ్గంటలకు తొలికోడి కూస్తుంది. వేగుచుక్క పొడిచింది!

♦ ♦ ♦ ♦

పదిరోజులకల్లా శివరామయ్య కొంత తేరుకొన్నాడు. మళ్ళి మామూలు మనిషయాడు. యథాప్రకారం బండిని దొర్లించుకు పోతున్నాడు. వారంరోజులనుంచీ, అంతకుముందు వెంకన్న చేస్తూవున్న దీపారాధన తండ్రిగారి సమాధి దగ్గర తనే స్వయంగా చేస్తున్నాడు. అనాథ శరణాలయ ధర్మకర్తల్లో ఒకరడిగితే చెప్పాడు. "వెంకన్న తన వాళ్ళెవరికో జబ్బుగా వున్నదని జాబువస్తే వూరికి వెళ్ళాడు. వెళ్ళాక ఇప్పట్లో రాలేననికూడా జాబు రాయించాడు. వెంకన్న లాంటి నమ్మకమైన మనుషులు సామాన్యంగా దొరకరు! అందుకే దీపారాధన నేనే చేస్తున్నాను." దీర్ఘంగా నిట్టూర్చి "వెంకన్న పోయిన దగ్గర్నుంచీ నాకు ఒక చెయ్యి విరిగినట్టుంది!" అనికూడా అన్నాడు శివరామయ్య.

ఆ రోజు సాయంత్రం మామూలుగానే తండ్రిగారి సమాధివద్ద దీపారాధన చేయటానికొచ్చాడు శివరామయ్య. మునిమాపు. మసక మసక చీకటి. సమాధివున్న ఆవరణలో వేపచెట్లు చీకట్లను పోగుచేసుకొంటున్నయ్. రావిచెట్టుమీద కొంగలు గుంపులు గుంపులుగావచ్చి తెల్లటి రెక్కలు వూపుతూ వాలుతున్నయ్. శరణాలయం కప్పుమీద ఓ గుడ్లగూబ జంటవచ్చి వాలింది.

తండ్రి సమాధిముందు ప్రమిదలో చమురుపోసి వత్తి తడుపుతూంటే, ఏధో ధ్వనివిని ఆయనగారివళ్ళు జలదరిం

చింది! అగ్గిపుల్ల వెలిగించాడేగాని వత్తిని ముట్టించలేకపోయాడు. మళ్ళీ అదే అరుపు! కుక్క అరుపులు!! సమాధిలోనుంచే వినపడుతూన్నట్లుంది!

వెలిగించిన అగ్గిపుల్ల చేత్తో పట్టుకొనే శివరామయ్య సమాధివెనక్కు వెళ్ళిచూశాడు. సమాధికి కొంచెం దూరంలో రెండు నల్లకుక్కలు కొట్లాడు కొంటున్నయ్! ఒక శవాన్ని సగం బైటికిలాగి పుర్రెకొరుకుతూ ఒకాదానొ్నకటి కరుచుకొంటూన్నయ్!! శవం సగం మట్టికిందా సగంపైనా వుంది.

కుక్కల్ని తరిమేసి శవాన్ని లోతుగా పూడ్చిపెడుతూ, దయార్ద్రహృదయుడు శివరామయ్యగారు యిలా అనుకొన్నాడు. "యానాది తత్తుకొడుకులు! చంపినవాళ్ళకు పూడ్చిపెట్టం తెలియదు, డబ్బు తినడంతప్ప!"

సమాధి నల్లరాయి కంపించి ప్రతిధ్వనించింది — జాలిగుండె శివరామయ్యగారన్నదాన్ని! అనాథ శరణాలయంమీద వాలిన గుడ్లగూబజంట భయంకరంగా అరుస్తూ లేచిపోయినై.